విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శనివారం 20 సెప్టెంబరు 2025 | 8 పేజీలు

మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను

అడ్డుకొని తీరుతాం..

వైసీపీ నేతల నిరసన

విశాలాంధ్ర-మార్కాపురం : నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మెడికల్ కాలేజీ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ చేపట్టిన ఛలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించే మంచి ఆలోచనతో నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి మార్కాపురం ప్రాంతంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పేద విద్యార్థులకు, నిరుపేదలకు, రోగులకు వైద్యసేవలు అందిస్తుందని ఈ ప్రాంతం ఎప్పటి నుంచో ఎదురు చూస్తుందని అయితే ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మెడికల్ కళాశాలను అప్పనంగా ప్రైవేటు వ్యక్తులకు దారాధత్తం చేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర పన్నుతుందని విమర్శించారు. వైద్యాన్ని పేదలకు అందించాలన్న ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, మొదటి నుంచి కూడా టీడీపీ పశ్చిమ ప్రకాశంపై వివక్షతతో వ్యవహరిస్తూ వస్తుందని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్పడం అంటే ఇంతకన్న దుర్మార్గమైన చర్య మరొకటి లేదని ఆయన విమర్శించారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత లక్షా 50 వేల కోట్లకు పైగా అప్పు తీసుకొచ్చిందని ఆ నిదుల్లో కొంతవరకైనా మెడికల్ కాలేజీకి వెలుగొండ ప్రాజెక్టుకు కేటాయించివుంటే ఈ ప్రాంతం అభివృద్ధి పదంలో పయనించేందుకు అవకాశం ఉండేదని ఆయన అన్నారు. రాష్ట్రంలో వైద్య రంగాన్ని విస్తృత పరిచేందుకు గత ఐదు సంవత్సరాల కాలంలో నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో అనేక దఫాలుగా చర్చలు జరిపి ఏకంగా 17 మెడికల్ కళాశాలలను రాష్ట్రానికి తీసుకురావడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. దేశంలోనే నేనే అత్యంత సీనియర్ అని పదేపదే డబ్బాలు కొట్టుకుంటున్న చంద్రబాబు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కళాశాలనైనా మన రాష్ట్రానికి తీసుకొచ్చారా అని

మిగతా 2 లో ...

గొట్టిపాడియ గ్యాప్, మెడికల్ కాలేజీని

కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-మార్కాపురం : జిల్లా నూతన కలెక్టర్ పి.రాజాబాబు శుక్రవారం, మార్కాపురం, పెద్దారవీడు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తొలుత జిల్లా కలెక్టర్ పి రాజాబాబు గొట్టిపడియ గ్యాప్‌ను సందర్శించి, గొట్టిపడియ గ్యాప్ ఇంటేక్ వద్ద ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంత ఆవాసాలకు చేపట్టిన మంచి నీటి సరఫరా పథకం పనులను పరిశీలించి అధికారుల నుండి వివరాలను అడిగితెలుసుకున్నారు. పశ్చిమ ప్రకాశం ప్రాంత ఆవాసాలకు చేపట్టిన మంచి నీటి సరఫరా పథకం ఆవశ్యకతను, వివరాలను ఆర్డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ భాగంగా పెద్దారవీడు మండలం, దేవరాజుగట్టు వద్ద ఏర్పాటుచేసిన ఆర్ అండ్ ఆర్ కాలనీని జిల్లా కలెక్టర్ రాజాబాబు

మిగతా 2 లో ...

రాజస్థాన్‌లో కొత్తపల్లి జవాన్ మృతి

8 లో..

ఒంగోలులోని పోలీస్ స్టేషన్‌ల్లో

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర- ఒంగోలు : ఒంగోలులోని పలు పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించించడమైనది. చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌లోనే మహిళా సహాయక కేంద్రం, రిసెప్షన్, లాక్ అప్ రూమ్స్ పరిశీలించారు. స్టేషన్ బయట నిలబడిన ఫిర్యాదు దారులతో స్వయంగా.. మాట్లాడి పోలీసుల పని తీరును అడిగి తెలుసుకున్నారు. పోలీసు స్టేషన్‌కు ఎవరైనా ఫిర్యాదు చేసేందుకు వస్తే... వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.పోలీసు స్టేషన్‌కు వచ్చే... వారి పట్ల మర్యాదగా వ్యవహరిస్తే.. పోలీసుల పట్ల ప్రజలలో గౌరవం పెరుగుతుందన్నారు. పోలీస్ స్టేషన్లో సీజ్ చేయబడిన వాహనాలను చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోర్టు అనుమతితో వాహనాలను డిస్పోసల్ చేసే విధంగా చర్యలు చెపట్టాలని అధికారులను ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పోలీసు స్టేషన్ యొక్క క్రైమ్ మ్యాప్‌లను పరిశీలించారు. పోలీసు స్టేషన్‌లోని రికార్డ్స్ పరిశీలించారు. పోలీసు స్టేషన్‌లో

మిగతా 2 లో ...

వైద్య విద్య ప్రైవేటీకరణకు

కూటమి ప్రభుత్వం కుట్ర

వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్రంలో యువతకు వైద్య విద్యను దూరం చేయటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నిందని వైయస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మేరుగ నాగార్జున తెలిపారు. పట్టణంలోని ఎంఎస్సార్ కళ్యాణ మండపం నుంచి జమ్ములపాలెం రోడ్‌లో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల వరకు వైసీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలలు ప్రవేటీకరణ నిర్ణయం మార్చుకోవాలని నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని లేకపోతే ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. చంద్రబాబు నాయుడు హయాంలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా తీసుకొచ్చిన దాఖలాలు లేవన్నారు. గత వైయస్ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలోనే 5 కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను పూర్తి చేస్తే మాజీ సీఎం జగన్‌కు మంచి పేరు వస్తుందనే దురుద్దేశ్యంతో ప్రైవేటుకు కట్టబెడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. మెడికల్ కళాశాలల్లో సౌకర్యాలు కల్పించలేమని కేంద్రానికి చంద్రబాబు లేఖ రాయడం దుర్మార్గమని విమర్శించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ద్వారా పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేసే కుట్రలు మాసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులకు అన్యాయం చేస్తే వైయస్ఆర్ సీపీ తరపున పోరాటాలు చేస్తూనే ఉంటామని హెచ్చరించారు.కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల మెడికల్ విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. వాస్తవాలను కూటమి ప్రభుత్వం విస్మరించి గోబెల్స్ ప్రచారం చేస్తోందన్నారు. ప్రైవేటీకరణ ముసుగులో టెండర్లు ప్రస్తుత కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలని పీపీపీ పేరుతో ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తోందని ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా, ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని టెండర్లు పిలుస్తున్నారన్నారు. గతంలో ప్రభుత్వం

మిగతా 2 లో ...

విశాలాంధ్ర epaper.visalaandhra.com శనివారం 20 । సెప్టెంబరు । 2025

2026 ఆగస్టుకు 'వెలిగొండ' పూర్తి

కలెక్టర్ పి.రాజాబాబు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ప్రకాశం జిల్లా జీవనాడి అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును వచ్చే ఏడాది 2026 ఆగష్టు నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొత్తూరు గ్రామం వద్దగల పులసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజబాబు తొలి ప్రాధాన్యంగా శుక్రవారం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులతో కలసి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కు సంబంధించి దోర్నాల మండలం, కొత్తూరు వద్ద నిర్మిస్తున్న 2వ టన్నెల్ ను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంటా ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జ్ గూడూరు ఎలక్షన్ బాబు సందర్శించారు. జిల్లా కలెక్టర్ రాజబాబు ఇప్పటివరకు పనులు కొనసాగిన తీరు, పెండింగ్ పనులపై అధికారులతో చర్చించారు. అనంతరం గంటవానిపల్లె చెరువు వద్ద కాలువ పనులను, తీగలేరు వాగును పరిశీలించి వివరాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, దోర్నాల మండల కేంద్రంలోని వెలిగొండ ప్రాజెక్టు అతిథి గృహంలో ప్రాజెక్టు ఇంజనీరింగ్, భూసేకరణ అధికారులు, ప్రాజెక్టు నిర్మాణ ప్రతినిధులతో సమావేశమై ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతి, పునరావాస కార్యక్రమాల అమలు తదితర అంశాలపై సమీక్షించారు. ఇప్పటికే మొదటి సొరంగం పనులన్నీ పూర్తయ్యాయని ఇంజనీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు ఆయనకు వివరించారు. రెండో సొరంగం పనులు కూడా 70 శాతం వరకు పూర్తయ్యాయని కలెక్టరుకు తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వలన కలిగే తాగు, సాగునీటి ప్రయోజనాలు, ఇతర వివరాలను ప్రాజెక్ట్ ఎస్.ఈ. శ్రీ అబూత్ అలీమ్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, వచ్చే ఏడాది ఆగస్టు నాటికి వెలుగొండ ప్రాజెక్ట్ పనులన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రెండో సొరంగం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని చెప్పారు. కలెక్టరుగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి ప్రాధాన్యంగా ఈ రోజు అధికారులతో కలసి వెలుగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున పనులు త్వరగా పూర్తయ్యేలా మరింత దృష్టి సారించాలని ఇంజనీరింగ్ అధికారులను, నిర్మాణ ప్రతినిధులను ఆదేశించడం జరిగిందని చెప్పారు. ఈ విషయంలో నిర్మాణ సంస్థకు అవసరమైన సహకారాన్ని జిల్లా యంత్రాంగం అందిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ముంపు గ్రామాల ప్రజలకు పునరావాస కాలనీల కోసం అవసరమైన ల్యాండ్ డెవలప్మెంట్ పనులు పూర్తయ్యాయన్నారు. బాధితులకు తగిన నష్టపరిహారం ఇచ్చి ముంపు గ్రామాల నుంచి ఖాళీ చేయించాల్సి ఉందన్నారు. వీటికి సంబంధించిన వివరాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణ పనులు, ముంపు గ్రామాల ప్రజల తరలింపును వచ్చే ఆగస్టు నాటికి పూర్తి అయ్యేలా చూస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో సుమారు 1,90,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా 15 లక్షల మందికి తాగునీటిని సరఫరా చేసేలా రూపొందించిన ఈ ప్రాజెక్టు నిర్మాణంపై జిల్లా యంత్రాంగానికి ముఖ్యమంత్రి శ్రీ. నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా దిశానిర్దేశం చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ప్రకాశం జిల్లాకు జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి అయితే వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలలో ఘనీయమైన అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ ప్రాంతం నుంచి వలసలను నివారించి సస్యశ్యామలం చేయాలన్న ప్రజల కోరికను నెరవేర్చేలా ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. జిల్లా కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్ రెడ్డి, సత్యనారాయణ, సీతారామిరెడ్డి, నియోజక వర్గ టీడీపీ ఇంచార్జి ఎరిక్షన్ బాబు, ఎస్సీ అబుతాలిం, ఈ కృష్ణారెడ్డి మెగా కంపెనీ ఇంజనీరింగ్ జీఎం సతీష్, ప్రాజెక్టు ఇంజనీరింగ్, టిడిపి నాయకులు షేక్ మా బు, ఈదర మల్లయ్య కొప్పుల వెంకటసుబ్బారెడ్డి, దొడ్డ శేషాద్రి,, టిడిపి నాయకులు, నిర్మాణ ప్రతినిధులు తదితరులు హాజరైనారు.

కూటమి ప్రభుత్వం కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

రూ.8500 కోట్ల వ్యయంతో మూడు దశల్లో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటికే ఐదు కాలేజీలు ప్రారంభమయ్యాయని మరో ఐదు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి పేదవాడు మెడిసిన్ చదవాలని ఎంతో సహృదయంతో ఆంధ్రప్రదేశ్ మొత్తం17 మెడికల్ కళాశాలను శంకుస్థాపన చేసి అందులో 8 మెడికల్ కళాశాలలను ప్రారంభించి పేద విద్యార్థులకు మెడిసిన్ విద్యను దగ్గర చేసే క్రమంలో పేద విద్యార్థులకు ఎంతో తోడ్పాటు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వేమూరి నియోజకవర్గ ఇంచార్జి వరికూటి అశోక్ బాబు, చీరాల నియోజకవర్గ ఇంచార్జ్ కరణం వెంకటేష్,పర్చూరు నియోజకవర్గ ఇంచార్జి గాదె మధు సుదన్ రెడ్డి, అద్దంకి నియోజకవర్గ నూతన ఇంచార్జి చింతలపూడి అశోక్ కుమార్, రేపల్లె నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇంచార్జి డాక్టర్ ఈవూరు గణేష్,కార్యదర్శులు చేజర్ల నారాయణ రెడ్డి, మోదుగుల బసవ పున్నారెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు మేరుగ చందన్‌నాగ్, జోగి రాజా, చల్లా రామయ్య,కొక్కిలిగడ్డ చెంచయ్య,సాగర్, జయభరత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

(మొదటిపేజీ తరువాయి)

కేసులు వివరాలు అడిగితెలుసుకున్నారు. పాత కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రత్యేక టీంలను ఎర్పాటు చేసి కేసులను త్వరితగతిన ఛేధించాలని ఆదేశించారు. ఒంగోలు మార్కెట్ ఏరియాలో డ్రోను, సీసీ కెమెరాల నిఘా ఉంచాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే ప్రాంతాలను గుర్తించి నిరంతరం డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన, అల్లర్లు చేసిన అలాంటి వారిని ఉపేక్షించవద్దన్నారు. లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కల్గించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌లో సిబ్బంది తో మాట్లాడారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేదిలేదన్నారు. జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కే.నాగేశ్వరరావు, ఒంగోలు డి.ఎస్.పి ఆర్ శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, తాలూకా ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, ఒంగోలు రూరల్ సిఐ ఎన్ శ్రీకాంత్ బాబు ఉన్నారు.

లక్ష సాధన కోసం చదవాలి

విశాలాంధ్ర - గిద్దలూరు : ఉత్తమ ఉపాధ్యాయుడు మొర్రి పిచ్చయ్య అన్నారు. గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని బాలురు ఉన్నత పాఠశాలలో 8.వ తరగతి చదువుతున్న 10 మంది విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష వ్రాయడానికి అవసరమైన స్టడీ మెటీరియల్స్‌ను యడవల్లి గ్రామానికి చెందిన యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షులు, హిందీ ఉపాధ్యాయులు డాక్టర్ మొర్రి.పిచ్చయ్య తన సొంత నిధుల నుంచి ఖర్చు చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం. సిద్దేశ్వర శర్మ ద్వారా శుక్రవారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు శర్మ మాట్లాడుతూ యశ్వంత్ ఎడ్యుకేషనల్ సోసైటీ ప్రతి సంవత్సరం తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పోటీ పరీక్షల సామాగ్రిని, స్టడీ మెటీరియల్స్ అందించడం అభినందనీయమన్నారు. దాత డాక్టర్ మొర్రి. పిచ్చయ్య మాట్లాడుతూ తన వార్షిక వేతనములో 20 శాతం డబ్బులను పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి, పోటీ పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులను ప్రోత్సహించ డానికి ఖర్చు చేస్తున్నానన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో గత 10 సంవత్సరాల నుంచి నేషనల్ మీన్స్ కం స్కాలర్షిప్ పరీక్షను వ్రాయడానికి అవసరమైన అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అడ్డుకొని తీరుతాం..

(మొదటిపేజీ తరువాయి)

ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేవలం వ్యాపార దృక్పథంతో రాష్ట్రంలో పరిపాలన కొనసాగిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ కాలేజీని ప్రభుత్వ పరిధిలోనే నిర్వహించాలని లేనిచో పెద్ద ఎత్తున మళ్లీ ఉద్యమం చేపడతామని వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ 50 శాతం పూర్తయిన మెడికల్ కళాశాలను పూర్తి చేయలేని అసమర్థ ప్రభుత్వం ఎన్డీఏ కూటమి అని విమర్శించారు. అనేక దశాబ్దాలుగా పూర్తిగా వెనుకబడిన మార్కాపురం ప్రాంతంలో రోగులకు వైద్యసేవలు అందించాలన్న సదాశయంతో నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తే దీన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి వ్యవహరిస్తుందని తీవ్రంగా విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ఎన్డీఏ కూటమి ఒక్క క్షణం కూడా అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని ఆయన అన్నారు. గిద్దలూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం ప్రాంతంలో ప్రజల సౌకర్యార్థం మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కోరిన వెంటనే మెడికల్ కళాశాలను మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. నిర్మాణ పనులు చివరిదశలో ఉన్నాయని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు కూడా ప్రారంభం అవుతాయని భావిస్తున్న తరుణంలో మెడికల్ కాలేజీని ప్రైవేటుపరం చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఎన్డీఏ కూటమి ఎటూ మంచి పనులు చేయలేదని, కనీసం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన మంచి పనులనైనా కొనసాగించాలని ఆయన ప్రభుత్వానికి హితవు పలికారు. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పశ్చిమ ప్రకాశాన్ని వివక్షతతో చూస్తున్నారని, అందులో భాగమే కాలేజీని ప్రైవేటీకరించడం, పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం జరుగుతుందని విమర్శించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని జగన్మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి చుండూరి రవి, కనిగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ ఆలీబేగ్, వైసీపీ పోలింగ్ బూత్ విభాగం రాష్ట్ర కార్యదర్శి పత్తి రవిచంద్ర, ఎంపీపీలు బండి లక్ష్మీదేవి, ఎస్ సుబ్బారెడ్డి లక్ష్మి, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి గాయం శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పోరెడ్డి చెంచిరెడ్డి, మురారి వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎస్‌కె సలీం, పార్టీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు బొగ్గవరపు శేషయ్య, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కెవి రమణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు గొలమారి శ్రీనివాసరెడ్డి, వై వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు డాక్టర్ సీహెచ్ కనకదుర్గ, ఎం ఉత్తమ్‌కుమార్, చాటికొండ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గట్టి బందోబస్తు : వైసీపీ ఛలో మెడికల్ కళాశాల కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో సీఐ సుబ్బారావు పర్యవేక్షణలో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆందోళన కార్యక్రమం సందర్భంగా పోలీసులు ముందస్తుగా వైసీపీ నాయకులకు నోటీసులు కూడా అందజేశారు. అయినప్పటికీ ఏ మాత్రం లెక్కచేయకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు మెడికల్ కాలేజీకి పెద్ద ఎత్తున కదం తొక్కారు.

కలెక్టర్ పరిశీలన

(మొదటిపేజీ తరువాయి)

సందర్శించగా, ఆర్ అండ్ ఆర్ కాలనీలో చేపట్టనున్న మౌలిక సదుపాయాల వివరాలను జిల్లా కలెక్టర్‌కు అధికారులు వివరించారు. అనంతరం ఆయన మార్కాపురం మండలం రాయవరం గ్రామం వద్ద నిర్మిస్తున్న వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. కళాశాల నిర్మాణ పనులు ఎంత వరకు పూర్తి అయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, ఎర్రగొండపాలెం నియోజక వర్గ టీడీపీ ఇంచార్జి జి.ఎరిక్షన్ బాబు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకర రావు, వెలిగొండ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ తుషార్‌డూడికి ఘన వీడ్కోలు

విశాలాంధ్ర - బాపట్ల : సమన్వాత్మక ఘటనలు సున్నిత దృక్కోణంతో పరిష్కరించే విధానం కలిగిన వ్యక్తి ఎస్పీ తుషార్‌డూడి అని ప్రస్తుత బాపట్ల ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. పట్టణంలోని గౌతమ్ గ్రాండ్‌లో బాపట్ల జిల్లా పూర్వ ఎస్పీగా పని చేసి చిత్తూరు బదిలీ అయిన ఎస్పీ తుషార్ దూడికి ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభను నిర్వహించారు. బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ ఎస్పీ తుషార్‌డూడి పనితీరు భేష్ అని అభినందించారు. బదిలీపై వెళ్తున్న చిత్తూరు జిల్లాలో కూడా ఇదే విధమైన శైలిలో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. తుషార్ దూడి మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్ అధికారులు వారికి అప్పగించిన విధులను నిబద్ధతతో నిర్వహించిన ఫలితంగానే జిల్లాలో శాంతి భద్రతలను సమర్థవంతంగా పరిరక్షించగలిగామని తెలిపారు. కృష్ణా నది పరివాహక ప్రాంతంలో వరదల సమయంలో జిల్లా పోలీస్ యంత్రాంగం ఎంతో సమర్థవంతంగా విధులు నిర్వహించిందని తెలిపారు. వీఐపి బందోబస్తు విధులలో, నేరాలను కట్టడి చెయ్యడంలో అనుకున్నదానికంటే మెరుగ్గా పోలీస్ అధికారులు, సిబ్బంది తమ విధులను నిర్వహించారని తెలిపారు.

జిల్లాలోని పోలీస్ అధికారులు తుషార్ దూడి సారథ్యంలో వారు నిర్వహించిన విధులు, కేసుల ఛేదనలో అందించిన తోడ్పాటు, ప్రతి విషయంలో ముందుచూపుతో ఆలోచించి క్లిష్ట సమయంలో ఎలా వ్యవహరించాలో చూపిన దిశానిర్దేశం తదితర అనుభవాలను పంచుకున్నారు. బాపట్ల జిల్లాలో రెండవ నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తుషార్ దూడి తనదైన శైలిలో శాంతి భద్రతలను పరిరక్షించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ అనితర సాధ్యమైన సైబర్ నేరాలను ఛేదించడంలో జిల్లాకు ప్రత్యేక స్థానం సంపాదించారు. జిల్లాలోని చుండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన "డిజిటల్ అరెస్ట్" తరహా సైబర్ నేరాన్ని, చీరాల 1 టౌన్, 2 టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో "ప్రభుత్వ పథకాల పేరుతో" జరిగిన సైబర్ నేరాన్ని, బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో "నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి" సైబర్ నేరాలకు పాల్పడిన రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన నేరగాళ్ల ముఠాలను సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అరెస్ట్ చేయడంలో జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ముందుండి నడిపించారు. బాపట్ల జిల్లాలో క్రైమ్ రేట్‌ను గణనీయంగా తగ్గించగలిగారు. అనంతరం బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తుషార్ దూడిని దుశ్శాలువుతో, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సి.సి.ఎస్. డి.ఎస్.పీ. పి. జగదీష్ నాయక్, డి.సి.ఆర్.బీ. డి.ఎస్.పీ. బాలమురళి కృష్ణ, రేపల్లె, బాపట్ల, చీరాల డి.ఎస్.పీలు ఏ. శ్రీనివాసరావు, జి.రామాంజనేయులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ కళాశాలను పామూరు మండలంలో ఏర్పాటు చేయాలి

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్

విశాలాంధ్ర-పామూరు రూరల్ : ట్రిబుల్ ఐటీ కళాశాలను పామూరు మండలం దూబగుంట్ల గ్రామంలో ఏర్పాటు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ కోరారు. స్థానిక గుజ్జులయల మంద రెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసినటువంటి ప్రదేశంలోనే ట్రిబుల్ ఐటీ కళాశాల నిర్మాణం చేపట్టాలన్నారు. ట్రిబుల్ ఐటీ కళాశాల పామూరు మండలంలో ఏర్పాటు అయితే సిఎస్ పురం, పామూరు మండలాలు అభివృద్ధి చెందటానికి అవకాశం ఉంటుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ట్రిపుల్ ఐటీ ఏర్పాటులో నిర్లక్ష్యం చేసిందన్నారు. చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన చోటే ట్రిబుల్ ఐటీ కళాశాలను నిర్మాణం చేయాలని, లేనిపక్షంలో యువకులను, విద్యార్థులను ప్రజా సంఘాల కలుపుకొని ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానం

విశాలాంధ్ర-సిఎస్ పురం : ప్రకాశం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సి ఎస్ పురం మండలంలో ఘనంగా జరిగింది. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యా శాఖాధికారి జె ప్రసాద రావు మాట్లాడుతూ విద్యా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను సన్మానించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుల సేవలను ఆయన కొనియాడారు. ఇద్దరు ఉత్తమ ఉపాధ్యాయులు తాము పనిచేసిన పాఠశాలల్లో భౌతిక వనరులు కల్పించడం, పిల్లలకు చక్కటి బోధన కల్పించారని ఆయన కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్న ఏ పి టి ఎఫ్ సి ఎస్ పురం మండల శాఖను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జి వెంకటేశ్వర్లు, జె భారతి లను శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ నాయకులు మండల అధ్యక్షుడు తోట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జె యస్ ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ తదితరులు ఉత్తమ ఉపాధ్యాయుల అంకితభావాన్ని ప్రశంసించారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఈ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, వారి త్యాగస్వభావం సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు.

అసెంబ్లీలో విద్యారంగ సమస్యలు చర్చించాలి

విశాలాంధ్ర-కనిగిరి : ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ప్రకాశం జిల్లా కనిగిరి అంబేద్కర్ విగ్రహం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ కనిగిరి నాయకులు అజయ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. పీజీ విద్యార్థులను శాపంగా మారిన జీవో నెంబర్ 77ను వెంటనే రద్దు చేయాలి, పి పి విధానంలో 10 మెడికల్ కాలేజ్ కార్పొరేట్ వ్యక్తులకు లీజుకు ఇవ్వడాన్ని తక్షణమే విరమించుకోవాలని, పెండింగ్ లో ఉన్న 6400 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువుల దూరం చేసే జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని, యువ్వగలం పాదయాత్రలో ఇచ్చిన హామీలకు రెండు సంవత్సరాలు గడుస్తున్నది కానీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి డిగ్రీ మరియు ఇంజనీరింగ్ కళాశాలలు మరియు విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎఫ్ కనిగిరి నాయకులు అజయ్, రోహిత్, సుల్తాన్, తరుణ్, మోజెస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కంభం చెరువు రూ.35 కోట్లతో అభివృద్ధి చేస్తాం

రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ

విశాలాంధ్ర -కంభం : చారిత్రాత్మక మైన కంభం చెరువు ను మొదటి దఫాగా 35 కోట్లతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా మని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు.శుక్రవారం కంభం చెరువుకు సందర్శించి అయన మాట్లాడారు. రాష్ట్రంలోనే అద్భుత మైన టూరిజం కేంద్రం గా కంభం చెరువును అభివృద్ధి చేసి చూపిస్తామని పేర్కొన్నారు .చెరువు ను చూస్తుంటే ఆహ్లాదకరమైన వాతావరం ఉందని అన్నారు. తాను జిల్లాలో అనేక సార్లు పర్యటించాను, చెరువు గురించి చెబుతుంటే విన్నాను గాని ఇంతవరకు చూడలేదని తెలిపారు .శ్రీకృష్ణదేవరాయలు సతీమణి కట్ట నిర్మాణం చేపట్టడం ఈ ప్రాంత ప్రజలకు వరప్రసాదిని అని కొనియాడారు. టూరిజం అనేది ఉపాధితోపాటుగా టూరిస్టులకు ఆహ్లాదాన్ని ఇస్తుందని తెలిపారు. కంభంలో కేంద్ర రిసోర్ట్స్ బోర్డింగ్ ఏర్పాటు చేయాలనీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తరచూ అనేవారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రములో చెరువులు అభివృద్ధి చేసి ప్రతి పంటకు నీళ్లు అందించాలి అన్నారని పేర్కొన్నారు. కంభం చెరువులో కొండల నడుమ ఒక రిసోర్ట్స్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని నూకసాని బాలాజీ అన్నారు.

పేద మహిళలకు లైన్స్ క్లబ్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-దర్శి : లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో శుక్రవారం రాజంపల్లి గ్రామానికి చెందిన యన్నాబత్తిన రవణమ్మ నిరుపేద మహిళ పురాతన రేకుల ఇల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలు దాటికి ఇంటి రేకులు పూర్తిగా దెబ్బతిని నష్టం వాటిల్లింది. లయన్స్ క్లబ్ సభ్యులు బాధిత మహిళకు లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ సభ్యుల సహాయ సహకారంతో 10వేల రూపాయలను ప్రముఖ డాక్టర్ విక్రమ్ కేర్ ఆర్థో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ లంకపోతు విక్రమ్ సింహారెడ్డి చేతుల మీదుగా నగదును బాధిత మహిళకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్యాట్ మార్కెటింగ్ చైర్ పర్సన్ కల్లూరి విద్యా సాగర్ రెడ్డి, గైడింగ్ లయన్ బూదాటి ఆంజనేయులు, క్లబ్ ప్రెసిడెంట్ తమ్మవరపు ఫణి బాబు, సెక్రటరీ పొనుగంటి బి వి సత్యనారాయ గుప్తా, ట్రెజరర్ జి అశోక్, క్లబ్ సభ్యులు యనుమల నర్సారెడ్డి, అంబటి గోవిందరెడ్డి, గువ్వల శ్రీనివాసరెడ్డి, డాక్టర్ బాబ్జన్, ధనిరెడ్డి వెంకటరెడ్డి, బిజ్జం నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంకులో పట్టుబడిన దొంగనోట్లు

విశాలాంధ్ర -కంభం : స్థానిక కంభం ఎస్‌బిఐలో సుబ్బారావు అనే వ్యక్తి నగదు డిపాజిట్ చేస్తున్న సమయంలో రూ. 21500లు దొంగ నోట్లు రావటంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సమాచారం మేరకు రావిపాడుకు చెందిన సుబ్బారావు ఈ నెల రెండొవ తేదీన బ్యాంకులో జమచేసి న నగదు లో దొంగ నోట్లు వచ్చాయని బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరసింహారావు ఈ నెల 16 వ తేదీన కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ నగదు తనకు వేరే వారు ఇచ్చారని సుబ్బారావు చెప్పిన నేపథ్యములో పోలీసులు ఆ కోణంలో విచారణ చేస్తున్నారు.

muthoot HOUSING FINANCE

ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్ : టిసి నం.14/2074-7, ముత్తూట్ సెంటర్, పున్నెన్‌రోడ్, తిరువనంతపురం-695 034, సిఐఎన్ నం : యు65922కెఎల్2010పిఎల్‌సి025624 కార్పొరేట్ ఆఫీస్ : 12/ఎ 01, 13వ అంతస్తు, పరిణీ క్రెసెంజో, ప్లాట్ నం.సి38 & సి39, బంద్రా కుర్లా కాంప్లెక్స్-జి బ్లాక్ (ఈస్ట్), ముంబై-400051, టెలి నం : 022-62728517, Email Id: authorised.officer@muthoot.com

అనుబంధం-4 [(నిబంధన 8(1)] స్వాధీనత ప్రకటన (స్థిర ఆస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు- 2002 యొక్క నిబంధన 3 తో చదివే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి **ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృతఅధికారిగా దిగువ సంతకందారు, ఈ కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / హామీదారు(లు) లకు డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. డిమాండ్ నోటీసు అందుకున్న తేదీ నుంచి 60 రోజుల గడువు పూర్తయిన తర్వాత కూడా రుణగ్రహీత(లు) / హామీదారు(లు) బాకీ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పేర్కొన్న నిబంధనల యొక్క నిబంధన 8 తో చదివే చట్టం లోని సెక్షన్ 13 (4) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, కింద వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నట్లు** రుణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమైనది.

వ. నం.	ఎల్‌పిఎన్/రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు	డిమాండ్ నోటీసు తేదీ	బకాయి పడిన మొత్తం (రూ.లలో) భవిష్యత్తు వడ్డీ వర్తించును	స్వాధీనత తేదీ
1.	లోన్ ఎక్కౌంట్ నెం. **MHFLRESGUN000005006968** 1. **కె. జనార్ధనరావు అలియాస్ కరణం జనార్ధనరావు,** 2. **కరణం అనూష**	06-మార్చి 2025	**06-మార్చి -2025 నాటికి రూ.13,68,384.00/-**	**15-సెప్టెంబరు -2025**

హామీగా పెట్టిన ఆస్తి(లు)/స్థిర ఆస్తి(లు) వివరాలు: బాపట్ల జిల్లా (పాత ప్రకాశం), పర్చూరు మండలం, పర్చూరు ఎస్ఆర్ఓ పరిధిలు, చెరుకూరు గ్రామం మరియు గ్రామ పంచాయతీ, డి.నం.8-26, అసెస్మెంట్ నం.1856, ఆర్.ఎస్.నం.616/1డి వద్ద 450 చదరపు అడుగుల నిర్మిత ప్రదేశంతో గ్రౌండ్ ఫ్లోర్ కలిగిన నివాసిత భవనంతో పాటు 94 చదరపు గజాల విస్తీర్ణపు భూమి యొక్క ఆస్తి మొత్తంగా. హద్దులు: తూర్పు: దాసరి సత్యనారాయణ మరియు ఇతరుల ఆస్తి, దక్షిణం: పంచాయతీ బజార్ - 24 అ॥లు, పడమర: పుప్పాల వరలక్ష్మి ఆస్తి-36 అ॥లు, ఉత్తరం: హైదర్ ఖాన్ ఇంటి ఆస్తి-24 అ॥లు.

ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని మరియు ఆస్తితో ఎటువంటి లావాదేవీలైనా పైన వివరించినట్లుగా డిమాండ్ చేసిన మొత్తం మరియు దానిపై భవిష్యత్తు వడ్డీకి గాను **ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** చార్జికి లోబడి ఉండునని ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీత/లు/హామీదారు/లు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్, తేదీ: 20 సెప్టెంబరు, 2025 సం/- అధీకృత అధికారి, ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరఫున

సింగరాయకొండ, టంగుటూరు పోలీస్ స్టేషన్‌లను

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : జిల్లాలోని సింగరాయకొండ టంగుటూరు పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్‌స్టేషన్ లో ఉన్న రికార్డులను పరిశీలించారు ఈ సందర్భంగా సిబ్బందికి వల సూచనలు చేశారు.ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై మరింత నమ్మకం పెంపొందించేలా ఉత్తమ సేవలు అందించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులకు పలు సూచనలు చేసారు. పోలీస్ స్టేషన్ లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి తక్షణమే పిర్యాదు దారులకు పరిష్కారం అందించాలన్నారు. స్టేషన్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు,వారి నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలని, చెడునడత కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎక్కువ సమయం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. సింగరాయకొండలో ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించాలని, గంజాయి మరియు మాదకద్రవ్యాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మహిళలు/పిల్లలపై జరిగే అకృత్యాలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు. సింగరాయకొండ పియస్ ఆవరణలో ఎస్పీ మొక్కను నాటి సిబ్బంది అందరూ పరిసరాలు పరిశుభ్రంగా, పచ్చదనంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం వరాహ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానాన్ని సందర్శించి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)కె. నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, సింగరాయకొండ సిఐ హజరత్తయ్య, సింగరాయకొండ ఎస్సై మహేంద్ర,టంగుటూరు ఎస్సై నాగేమలేశ్వరరావు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే చిన్నారులకు ఆరోగ్యం

విశాలాంధ్ర-దొనకొండ: పౌష్టికాహారంతోనే మీ చిన్నారులకు మంచి ఆరోగ్యం ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ఎండి దావూద్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఆర్.పరిమళ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం శుక్రవారం జరిగింది. సీడీపీఓ మాట్లాడుతూ కుటుంబ సుపోషణలో పురుషుల యొక్క భాగస్వామ్యం మరియు ప్రాముఖ్యతను వివరించారు. వైద్యాధికారులు ప్రశాంత్‌కుమార్, చంద్రమౌళి మాట్లాడుతూ ఊబకాయం, ఇతర అనారోగ్యాలకు పోషకాహార లోపం ఎలా కారణ మవుతుందో వివరించారు. ఊబకాయం రాకుండా తీసుకోవాల్సిన ఆహారం వివరించారు. ఐటీసీ ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్రావు మాట్లా డుతూ 3-6 సంవత్సరాల పిల్లలకు ప్రొటీన్లు, విటమిన్లు, ఆకు కూరలు, పండ్లు వంటి పౌష్టికాహారం అందిస్తే శరీరం మరియు మెదడు సమగ్ర అభివృద్ధి చెందు తాయన్నారు. అనంతరం అందరితో పౌష్టికాహార ప్రతిజ్ఞ చేయించారు. కార్య క్రమంలో ఏపీయం జి.వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ ఫ్లెమింగ్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

గ్రంథాలయ స్థలం పరిశీలన

విశాలాంధ్ర-తాళ్లూరు: తాళ్లూరు శాఖ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీవీ శివా రెడ్డి పరిశీలించారు. గ్రంథాలయంలో పుస్తకాలు, వసతులు, ఇతర రికార్డులను పరిశీలించారు. వార్షిక తనిఖీలలో బాగంగా తనిఖీ నిర్వహించినట్లు చెప్పారు. గ్రంథాలయ సెస్ సకాలంలో మంజూరుకు అధికారులకు వినతులు అందించాలని , పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా చూసుకోవాలని గ్రంథపాలకురాలు విజయకుమారిని కోరారు. అద్దె భవనం సెంటర్ కావటంతో ధుమ్ము , దూళీ ఎక్కువగా వస్తున్నట్లు సీనియర్ రీడర్స్ తెలిపారు. అనంతరం గతంలో భవనం మంజూరు అయిన బాగు చేసిన ఆగిన స్థలాన్ని పరిశీలించారు. గ్రంథపాలకురాలు విజయకుమారి, బీడీ సీవీల్ నిర్వాహకురాలు పద్మావతి, రిటైర్డు హెచ్ఎం అంజిరెడ్డి పాల్గొన్నారు.

బూచేపల్లి శివప్రసాద్ రెడ్డికి పోలీసుల నోటీసులు

విశాలాంధ్ర -చీమకుర్తి: ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షుడు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డికి పోలీసులు నోటీసులు శుక్రవారం అందజేశారు. మార్కాపురం డివిజన్ పరిధిలో పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని ఎటువంటి ర్యాలీలు సభలు నిర్వహించడం కూడదని నోటీసులలో పేర్కొన్నారు. మార్కాపురం మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ పై నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు శివప్రసాద్ రెడ్డికి నోటీసులు ఇవ్వడం జరిగింది.

సమస్యల నాడి పట్టిన వైద్యుడు 'ఉగ్ర'

- సానికొమ్ము తిరుపతిరెడ్డి

విశాలాంధ్ర- కనిగిరి : ప్రజా పాలనలో ప్రజల సమస్యల నాడి పట్టిన వైద్యుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అని హనుమంతుదుపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్నారు. గతంలో పనిచేసిన ఎమ్మెల్యేల కాకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, వారి సమస్యలను పరిష్కరిస్తున్నారని, ప్రజలతో సన్నిహితంగా ఉంటున్నారని అన్నారు. ముఖ్యంగా, రేషన్ కార్డులు, నూతన ఇండ్లు వంటి కీలక అంశాలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆయన గమనించారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో చర్చించి, తగిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

916 మంది పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య సేవలు

విశాలాంధ్ర -ఒంగోలు : ఒంగోలులోని నగర పాలక సంస్థ కార్యాలయంలో స్వచ్ఛతాహి సేవ 2025 లో భాగంగా శుక్రవారం ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, ఇ ఎస్ ఐ ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఒంగోలు నగర పరిధిలోని 916 మంది పారిశుధ్య కార్మికులు వినియోగించుకున్నారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సంబంధించిన నలుగురు వైద్యులు ఆర్థో, చెస్ట్, డెర్మటాలజీ, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి కార్మికులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఎస్ఐ కార్పొరేషన్ ఒంగోలు బ్రాంచ్ మేనేజర్ సత్య ప్రకాష్ మాట్లాడుతూ ఈఎస్ఐ ద్వారా కార్మికులకు వచ్చే ప్రయోజనాలను వివరించారు. ఒంగోలు నగర కమిషనర్ కే.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, తాగుడు వంటి వ్యసనాలకు బానిస కాకుండా దూరంగా ఉండాలని సూచించారు. ఒంగోలు దగ్గర డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్లు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దెను పరిశీలించిన జనసేన, టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం పట్టణంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ఆసిఫ్ నగర్‌లో లక్ష్మీశెట్టి వీరాంజనేయులుకు సంబంధించిన మట్టి మిద్దె కూలిపోయింది. సమయానికి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో తనను ప్రభుత్వం ఆదుకోవాలని వీరాంజనేయులు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం కూలిపోయిన ఇంటిని జనసేన, టిడిపి నాయకులు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

154 మందికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని నాగంపల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ ఎస్పీ బాలయ్య ఆధ్వర్యంలో స్వస్థ్ నారి స శక్తి పరివార్ వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు పోషకాహారం లోపంతో బాధపడే వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా అందరూ

వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని, దోమకాటు గురి కాకుండా దోమతెరలు వాడాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఆరోగ్య సూచనలు సలహాలు చేశారు. ఈ వైద్య శిబిరాలు అక్టోబర్ నెల 2 తేదీ వరకు అన్ని గ్రామ సచివాలయాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈ ఓ, పి సి నారాయణ రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ జే వెంకటేశ్వర్లు, ఎం.ఎల్ హెచ్ పి విజయ్ కుమారి, ఆరోగ్య కార్యకర్త షమీమున్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీఆర్వో ఇంట్లో చోరీ

విశాలాంధ్ర - గిద్దలూరు : ఇంట్లో ఎవరు లేని సమయంలో దొంగలు ఇంట్లో ఉన్న బంగారు సామాగ్రి డబ్బులు దొంగతనం చేసిన సంఘటన గిద్దలూరు మండలం కొండపేట గ్రామంలో జరిగింది. వివరాల్లోకెళ్తే వీఆర్వో గా పని చేస్తున్న లక్ష్మి మూడు రోజుల కిందట చెన్నైకి వెళ్ళింది. మూడు రోజులు అనంతరం శుక్రవారం ఉదయం ఇంటిలోనికి వస్తే ఇంట్లో బీరువా తెరచి ఉండటానికి గమనించిన లక్ష్మి పరిశీలించగా 2 లక్షల రూపాయలు 11 తులాల బంగారు కనిపించక పోవడంతో లక్ష్మి ఆందోళన చెందింది. వెంటనే గిద్దలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

విశాలాంధ్ర -వెలిగండ్ల: బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన మోటార్ సైకిల్ పై ప్రయాణించిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ కృపా పావని అన్నారు. శుక్రవారం మండలంలో ఉన్నత అధికారుల ఆదేశాలమేరకు బహిరంగ ప్రదేశాలలో మద్యం సీసాలను పంచాయితీ కార్మికులు, పోలీసు సిబ్బంది కలయికతో బహిరంగ ప్రదేశాలలో ఉన్న సీసాలను ఏరిపించారు. వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు లేకపోతే ప్రమాదాలు జరుగుతాయి అని కుటుంబం మీపై ఆధారి పడి నడుస్తుందని అన్నారు,కుటుంబ యజమాని మద్యం సేవించి ప్రమాదము జరిగితే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదురుకుంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబంది, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత సహకారం విడుదల చేయరా!

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : దశాబ్ద కాలంపైగా రాష్ట్రంలోని చేనేత సహకారం సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసిన బకాయిలను చెల్లించరా అంటూ ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించవలసిన రూ.172 కోట్లు బకాయిలను చెల్లించాలని,సహకార సంఘాలకు తక్షణమే భారతవర్గ ఎన్నికలు నిర్వహించి కార్మికుల ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న చేనేత అధ్యయన యాత్రలో భాగంగా గురువారం రాత్రి మండల కేంద్రమైన చెరుకుపల్లిలో కొనసాగింది.యాత్రలో భాగంగా కొత్తపేట,చెరుకుపల్లి,శివాలయం సెంటర్ తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు కలుసుకొని ఎదుర్కొంటున్న వారి సమస్యలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే చేనేత కార్మికులు పడుతున్న కష్టాలను తొలగించేందుకు చర్యలు చేపట్టడంతో పాటు చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తామంటూ వాగ్దానాలు చేసి అధికారంలోకి వస్తున్న పాలక ప్రభుత్వాలు ఆచరణలో చేయక నేతలను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.చేనేత కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం రాజకీయాలకు అతీతంగా సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ వేతన భరోసాని రూ.36 వేలకు పెంచి సొంత మొగ్గ ఉన్నవారు తో పాటు షెడ్డు కార్మికులకు,ఉపవృత్తులపై జీవిస్తున్న కార్మికులకు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేనేత పరిశ్రమ రక్షణ కోసం కార్మికుల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు చేనేత వస్త్రాల అమ్మకాలపై సంవత్సరం పొడుగునా 30 శాతం రిబేట్ పథకాన్ని అమలు చేయాలని కోరారు.చేనేత సహకార సంఘాలకు తక్షణమే విడుదల చేయటంతో పాటు చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలను నిర్వహించి ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోవాలని బాలాజీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నాయకులు బత్తుల మోహన్‌రావు,గజవల్లి వెంకట కృష్ణారావు, కొడాలి రామకోటేశ్వరరావు,వీర మోహన్‌రావు, కౌతరపు పార్ధసారథి,బండారు శ్రీనివాసరావు, నాగేంద్రరావు,ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు మర్రివాడ వెంకట్రావు,వీర వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదిగా నరేంద్రకుమార్

విశాలాంధ్ర - పర్చూరు : పర్చూరు కోర్టు భవనాల సముదాయ సీనియర్,జూనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా కొల్లా నరేంద్రకుమార్ నియమితులయ్యారు.రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.పర్చూరు కోర్టులో సీనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఏజీపీగా నియమితులైన కొల్లా నరేంద్ర కుమారును ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభినందించారు.న్యాయవాదుల సంఘం ప్రతినిధులు, న్యాయవాదులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు,స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు,ప్రముఖులు నరేంద్రకుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

వయోజనులకు విద్యా ఆవశ్యకతపై శిక్షణ

విశాలాంధ్ర - పర్చూరు : వయోజనులు విద్యా ఆవశ్యకతను గుర్తించి దృష్టి సారించాలని ఎంపీడీవో వెంకటస్వామి తెలిపారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సీసీలు,వివోఏలు,వాలంటీర్ టీచర్లకు ఉల్లాస్-అక్షర ఆంధ్ర మండల స్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది.పాఠశాలకెళ్ళే వయసులో బడి చదువుకు నోచుకోక,చదువుకునే వయసు దాటిపోయిన వయోజనులు దైనందిన కార్యక్రమాలలో ఉపయోగపడేలా చదవడం, రాయడం నేర్పించడం వంటి అవకాశాలను అందజేయడం కోసం వయోజన విద్యా శాఖ కృషి చేస్తుంది తెలిపారు.జాతీయ విద్యా విధానం-2020కి నిర్దేశించిన ప్రకారం చదువురాని వారికి ప్రాథమిక అక్షరాస్యతతో పాటు,21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన నైపుణ్యాలను అందజేయడానికి భారత ప్రభుత్వము రూపొందించిన ఉల్లాస్ పథకము ద్వారా రాష్ట్రములో 2029 కల్లా వంద శాతం అక్షరాస్యత సాధించాలని కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కొసనా సత్యనారాయణ,ఏపిఎం కె.రామకృష్ణ,వయోజన విద్య పర్యవేక్షకులు కొడిదల మనోరంజన్ బాబు ఉన్నారు.

దస్తావేజు లేఖరులు పెన్ డౌన్

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకిలో శుక్రవారం దస్తావేజు లేఖరులు పెన్ డౌన్ పాటించారు.రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వలన దస్తావేజులు తయారీ జటిలమవుతున్న దృష్ట్యా పెన్ డౌన్ నిర్వహించినట్లు దస్తావేజులేఖర్ల సంఘం నాయకులు ప్రసాద్ చెప్పారు.రిజిస్ట్రేషన్ శాఖలో పాత విధానాన్ని అమలు చేయాలని రిజిస్ట్రార్ నవకుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏలు ధర్నా

విశాలాంధ్ర - అద్దంకి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో మండల రెవెన్యూ సహాయకులు శుక్రవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని,నామినీలను వీఆర్ఏలుగా నియమించాలని,అర్హత కలిగిన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం తహసీల్దార్ శ్రీచరణ్‌కు వినతి పత్రం సమర్పించారు. వీఆర్ఏల సంఘం అధ్యక్షులు మర్రిపూడి నరసింహారావు,ఉపాధ్యక్షులు కసపర్తి స్వాములు, పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఆదాయ,వనరులపై శిక్షణ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : గ్రామ పంచాయతీ స్వంత ఆదాయ వనరుల నిర్వహణ గురించి గ్రామ పంచాయతీ సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు,డిజిటల్ అసిస్టెంట్లకు,ఇంజనీరింగ్ సహాయకులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.బాపట్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 19,20 రెండు రోజులు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్‌గా జే.మరియమ్మ,ఒ.చక్రధర్,సహాయకులు పాల్గొన్నారు.

కుటుంబ పోషణలో పురుషుల భాగస్వామ్యం అవసరం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : పురుషులు కుటుంబ సభ్యులతో పోషణపై చర్చలు, మార్గదర్శనం,లింగ సమానత్వం తదితర అంశాలు ఆరోగ్యకరమైన కుటుంబానికి బలమైన పునాది వంటివని సీడీపీవో అనసూయ అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని ఆరుంబాక పంచాయతీ ఏమినేని వారిపాలెం గ్రామంలో కుటుంబ సంబంధ విషయాలలో పురుషుల పాత్రపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.పురుషులు బాధ్యతాయుతంగా ఉంటే తల్లి,శిశువు ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు.కుటుంబ బంధం బలంగా నిలబడుతుందన్నారు. అదేవిధంగా తూర్పుపాలెం పంచాయతీ మతివారిపాలెం గ్రామంలో అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా మాట్లాడుతూ పురుషులు కుటుంబం పట్ల శ్రద్ధ వహించి పిల్లల ఆరోగ్యం,గర్భిణీ స్త్రీల పోషణ,శిశు సంరక్షణ తదితర కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. తండ్రిగా పిల్లల ఆహారం నిద్ర ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు.గర్భిణీలకు పోషకాహారం అందించి ఆరోగ్యకరమైన ఆహారాన్ని సిద్ధం చేయటం వాటిని సమయానికి వారు తీసుకునేలా చూడటం వారికి అవసరమైన ఆరోగ్య సేవలు అందించడం వైద్య పరీక్షలకు తీసుకెళ్లటం మానసికంగా మద్దతు ఇవ్వడం తదితర పనులను చేసినప్పుడు ఆ కుటుంబం ఎంతో ఆనందంగా ఆరోగ్యంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ కెవి సుబ్బమ్మ, ఆరోగ్యశాఖ వారు,అంగన్‌వాడీ కార్యకర్తలు .పురుషులు పాల్గొన్నారు.

ప్రజలకు స్మార్ట్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - యద్దనపూడి : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ కార్డులతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని టీడీపీ మండల నాయకులు కసపర్తి నాగేశ్వరరావు అన్నారు.యద్దనపూడిలో ప్రజలకు ఆయన స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కసపర్తి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కొరకు ప్రభుత్వం పథకాలను ప్రవేశపెట్టి అమలు పరుస్తుందని,ఈ స్మార్ట్ కార్డుల ద్వారా లబ్ధిదారులు పారదర్శకంగా సులభంగా రేషన్ షాపుల నుండి సరుకులను రాష్ట్రంలో ఎక్కడ నుంచి అయినా, పొందవచ్చని వివరించారు.పథకాలకు కార్డును గుర్తింపుగా వినియోగించుకోవచ్చని తెలిపారు.అలాగే నిత్యవసరాల పంపిణీలో పారదర్శకంగా వీలుంటుందని చెప్పారు. సూరిశెట్టి శ్రీనివాస రావు, షేక్ బాజీ,కొండల రాయుడు, సతీష్, రావూరి రాధా,అత్తోటి శ్రీను,గొట్టిపాటి వేణు,వద్దను శ్రీను,పోతా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార వంటల పోటీలు

విశాలాంధ్ర - పర్చూరు : పోషణ మహా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉప్పుటూరు లోని అంగన్వాడీ కేంద్రంలో తల్లుల ఆధ్వర్యంలో పోషకాహార వంటల పోటీలనీ సీడీపీవో సుబద్ర నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ ఇంటి పనిలో పురుషులు కూడా భాగస్వామ్యం పంచుకుంటే, ఇల్లాలిపై భారం తగ్గుతుందని,తద్వారా మెరుగైన కుటుంబాలు నిర్మించబడతాయి అనే ఉద్దేశంతోనే ఈ పోటీలు ప్రభుత్వం చేపట్టిందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం స్వస్థనారి శశక్తి పరివార అభియాన్ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో స్త్రీల కోసం ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు అక్టోబర్ 2వ తారీకు వరకు నిర్వహించ బడుతున్నాయని,కావున మహిళలు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని కోరారు.అనంతరం అందరూ పోషకాహార ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునంద, అంగన్‌వాడీ కార్యకర్తలు,హెచ్ఈ శృతి,ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా వర్కర్లు,గ్రామస్తులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర - అద్దంకి : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొని దంపతులు గాయపడిన ఘటన శుక్రవారం అద్దంకిలో జరిగింది.పట్టణంలోని పెరిక పాలెంకు చెందిన మిరియంపల్లి ప్రసన్నాంజనేయులు,పార్వతి దంపతులు శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వస్తుండగా దామవారిపాలెం నరసింహస్వామి గుడి వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో దంపతులకు గాయాలయ్యాయి.స్థానికులు సమాచారం మేరకు 108 సిబ్బంది అంబులెన్స్‌లో క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పార్వతి కాలు విరగడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు.

ప్రజా దర్బార్‌లో గౌరీ అమర్‌నాథ్

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆదేశానుసారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్‌నాథ్ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంబంధిత అధికారులకు అర్జీలను పంపి త్వరగతిన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మొత్తం 95 అర్జీలు రాగా పింఛను కోసం 15 అర్జీలు, ఇళ్ల స్థలాల కోసం 75 అర్జీలు ఇతర సమస్యలపై 5 అర్జీలు వచ్చాయి. తెదేపా చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్‌రావు, యర్ర శివ నాగమల్లేశ్వరి, కారంపూడి పద్మిని, నాగలక్ష్మి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి పెంపొందించాలి

విశాలాంధ్ర - పర్చూరు : స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘాల సహాయకుల సమీక్ష సమావేశం జరిగింది. డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. లవన్న మాట్లాడుతూ జీవనోపాధి పెంపొందించుకోవాలని, ప్రతి మహిళ కూడా ఎంటర్ ప్రెన్యూర్‌గా ఎదగాలని తెలియజేశారు. ముఖ్యంగా స్త్రీ నిధి ఉన్నతి, బ్యాంకు లింకేజీ రౌండింగ్ చేయడం, రిగవరీలపైన దృష్టి పెట్టాలని ఆదేశించారు. గ్రామ సంఘాలకు బయోమెట్రిక్ డివైసులు పంపిణీ చేశారు. ఏపిఎం రామకృష్ణ, శ్రీనిధి మేనేజర్ కామేశ్వరి, ఏపీఎం కరుణాకర్, సీసీలు శ్రీనివాసమూర్తి, విజయ్ కుమార్, ప్రమీల, మండల సమాఖ్య అకౌంటెంట్, వివోఏలు పాల్గొన్నారు.

ఎస్.ఎల్ గుడిపాడులో 'పోషణ మాసోత్సవం'

విశాలాంధ్ర - బల్లికురవ : పోషణ మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా బల్లికురవ మండలం ఎస్.ఎల్ గుడిపాడులో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పోషణ, సంరక్షణలో పురుషులు చు రుకైన పాత్ర అనే అంశం గురించి చర్చించారు. పిల్లల ఆరోగ్యం, గర్భిణీల పోషణ, శిశు సంరక్షణ అనేవి కేవలం మహిళల బాధ్యత మాత్రమే కాదు, పురుషులు కూడా ఈ ప్రయాణంలో భాగస్వామ్యం అవ్వాలని ఈ సందర్భంగా సీడీపీవో డి.సుధా తెలియజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.సలోమి, మహిళా పోలీసు పి.స్వాతి, అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, అంకమ్మ, పిల్లల తల్లిదండ్రులు తల్లులు పాల్గొన్నారు.

బస్‌స్టాప్‌గా ఖాదర్ ఖాన్ సెంటర్

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ఎన్నో రోజులుగా ఎన్నో గ్రామాలకు చెందిన ఎంతో మంది రేపల్లె డిపోల ఆర్టీసీ బస్సులను ఖాదర్ ఖాన్ సెంటర్లో ఆపాలని అది కాకుండా రేపల్లె డిపో నుండి ఖాదర్ ఖాన్ సెంటర్లో దిగే ప్రయాణికులకు రాంభట్లవారిపాలెం టిక్కెట్లు ఇస్తున్నారని పలుమార్లు అధికారుల దృష్టికి ఈ సమస్యను సందర్భంగా రేపల్లె డిపో మేనేజర్ ప్రజల సమస్యలను గుర్తించి ఖాదర్ ఖాన్ సెంటర్‌ను కామన్ బస్ స్టాప్‌గా ప్రకటించారు. అలాగే తెనాలి డిపో బస్సులను కూడా ఖాదర్ ఖాన్ సెంటరు వరకు తిప్పే విధంగా మేనేజర్ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : ఉరేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఖాజీపాలెం గ్రామం శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. చందోలు ఎస్సై వెంకట శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో అయోధ్య నగర్‌కు చెందిన కంటేటి మల్లేశ్వరరావు కుటుంబ కలహాల నేపథ్యంలో గురువారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో తన ఇంటి వద్ద ఉన్న తుమ్మ కర్ర పంగకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ మేరకు ఘటనా స్థలానికి చందోలు ఎస్సై వెంకట శివకుమార్ సందర్శించి మృత దేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేనేత సహకార సంఘాలకు

పాలకవర్గ ఎన్నికలు జరపాలి

- ◆వేటపాలెం చేరుకున్న చేనేత అధ్యయన యాత్ర
- ◆నేతన్న కుటుంబానికి రూ.36వేల ఆర్థిక సాయం ఇవ్వాలి
- ◆మార్కెటింగ్ లోపంతో కార్మికులు కష్టాలు
- ◆ ప్రభుత్వానికి హెచ్చరిక, స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం

విశాలాంధ్ర - వేటపాలెం : ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో చేపట్టిన చేనేత అధ్యాయన యాత్రలో భాగంగా నాయకులు శుక్రవారం వేటపాలెం మండలంలో పర్యటించారు. ఈనెల 11 తేదీ నుండి కృష్ణాజిల్లా పెడన నుండి గుంటూరు జిల్లా మీదుగా బాపట్ల జిల్లా వేటపాలెంకు శుక్రవారం చేరుకుంది. రాష్ట్రంలో ఉన్న 26 జిల్లాలలో పర్యటించి రాష్ట్రంలో ఉన్న చేనేత సహకార సంఘాల నాయకులను కలిసి చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందులపై అధ్యయనం చేయనున్నామని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు వెంటనే పాలకవర్గ ఎన్నికలు జరపాలని, మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి నేతన్న భరోసా పథకం కింద రూ. 36 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. 1985లో చేనేతను చిన్నతరహా పరిశ్రమగా గుర్తించి వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తామని కేంద్రం తీసుకున్న నిర్ణయం ఇప్పటికీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 43 రకాల పన్నులు రద్దు చేస్తామని హామీ ఇచ్చినా యార్న్‌పై పన్నులు కొనసాగుతూనే ఉండడం, ఉత్పత్తి ఖర్చులు పెరుగుతుండడం, మార్కెటింగ్ లోపం కారణంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చేనేత ఉత్పత్తులకు సరసమైన ధరలు కల్పించడం, యార్న్ సబ్సిడీని విస్తరించడం, హ్యాండ్‌లూమ్ వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వడం, కార్మికులకు పెన్షన్లు, వైద్య సదుపాయాలు, భీమా కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే గ్రామీణ స్థాయిలో చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక పథకాలు అవసరమని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టిముక్కల బాలాజీ, రాష్ట్ర సమితి సభ్యులు మేడా వెంకట్రావు, సొసైటీ అధ్యక్షులు భూసం శ్రీనివాసరావు, ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండ్ల వెంకటేశ్వర్లు (బాబు) తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడి మృతి

విశాలాంధ్ర - బల్లికురవ : మండలంలో ఉప్పుమాగులూరు పరిధిలోని హర్షిత గ్రానైట్ ఫ్యాక్టరీలో క్రేను ఆపరేటర్ పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్ చెందిన రాకేష్ కుమార్ (30) ఉదయం 9 గంటల ప్రాంతంలో చనిపోయాడు.
హర్షిత గ్రానైట్ ఫ్యాక్టరీలో క్రేను ఆపరేటర్‌గా వర్క్ చేస్తున్న రాకేష్ కుమార్ గ్రానైట్ బండను క్రేన్‌కు తగిలించి లేపుతుండగా ఒక్కసారి అమాంతంగా రాకేష్ కుమార్ మీద పడటంతో గాయాలు పాలైన రాకేష్ కుమార్‌ను చిలకలూరిపేట ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకుపోతుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు.
సంఘటన ఘటనపై బల్లికురవ ఎస్సై వై. నాగరాజు దర్యాప్తు చేస్తున్నారు.

పేద మహిళకు అండగా జనసేన

విశాలాంధ్ర - రేపల్లె : మహిళలకు ఆర్థికంగా చేయూతనందించి వారికి అండగా నిలబడటమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ పేర్కొన్నారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో ఒంటరి మహిళకు తోపుడు బండిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా పట్టుదల ఉంటే ముందుకు సాగే మార్గం ఎప్పుడూ దొరుకుతుందని తెలిపారు. పట్టణంలోని 6వ వార్డులో నివాసముంటున్న ఒంటరి మహిళల పద్యాల గాయత్రి నూతన వ్యాపారం చేసుకునేలా జనసేన పార్టీ వార్డు అధ్యకులు ప్రోత్సహించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పరిశ రాజు, దేవగిరి శంకర్, శ్రీకాంత్, సురేష్, వెంకటేశ్వరరావు, లంకేశ్వర్, గోవర్ధన్, గిరిధర్, గురుబ్రహ్మం అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్ణయించుకోవాలి

విశాలాంధ్ర - అద్దంకి : విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాలను నిర్ణయించుకొని ముందుకు సాగాలని జిల్లా పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక ఐపిఎస్ అన్నారు. శుక్రవారం స్థానిక కెఆర్కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాధిక ఐపిఎస్ జీవితంలో సవాళ్లను ఎలా అధిక మించాలి, సైబర్ నేరాలు మత్తుమందుల వినియోగం ఇతర అసాంఘిక కార్యక్రమాలు కళాశాలల్లో జరుగుతున్న ర్యాగింగ్ వంటి దుశ్చర్యల వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మోహన్‌రావు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్షలు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె రోటరీ క్లబ్ ఆఫ్ రూరల్ ఆధ్వర్యంలో రైలు పేటలో గల రామకృష్ణవిద్యాలయంలో బాలబాలికలకు డాక్టర్ కుడిత పూడి వెంకట రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్షలు సుమారు వందమంది బాలబాలికలకు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు తగు సూచనలు, సలహాలు డాక్టర్ రాఘవేంద్ర సూచించారు. అనంతరం క్లబ్ అధ్యక్షులు గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు 100 మంది బాల బాలికలకు టూత్ బ్రష్‌లు, పేస్టులు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. సీనియర్ సిటిజన్ రీజినల్ చైర్మన్ ఎం.ఎం సక్సేన, క్లబ్ కార్యదర్శి టీఎస్ రామకృష్ణ, కుడితపూడి హరిత, యార్లగడ్డ బుచ్చిరావు, వేములపల్లి రాఘవేంద్ర రావు, గొట్టుముక్కల బాపారావు, తలసిల రామారావు, కేసన పూర్ణచంద్రరావు, కోడూరి ప్రవీణ్, సిహెచ్ కిషోర్, చెన్ను సాయిబాబు, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు అన్నవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల పెన్ డౌన్

విశాలాంధ్ర - పర్చూరు : ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో తీసుకువచ్చిన నూతన విధానాన్ని వ్యతిరేకిస్తూ దస్తావేజు లేఖరులు శుక్రవారం, శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నూతన విధానం వలన రిజిస్ట్రేషన్ ఆలస్యం అవుతుందని, సమస్యలు ఉత్పన్నమవుతాయని, వాటిని ఉపసంహరించుకోవాలని వారు కోరారు. నిరసన కార్యక్రమంలో లేఖరులు కాల్వ సత్యనారాయణ, తులసి శ్రీనివాసరావు, మోహన్ తదితరులు ఉన్నారు.

పొంగిన దోర్నపు వాగు

దోర్నపు వాగు వద్ద పోలీసులు కాపలా

మల్లాపురం పంచాయితీలో విధులకు వెళ్లలేక ఆగిన ఉద్యోగులు

విశాలాంధ్ర – తాళ్లూరు: గత రెండు రోజుల నుండి ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఎండ సాయంత్రం వేళ జోరు వర్షం కురుస్తుండటంతో పాటు ఎగువ మండలాలలో సైతం అధిక వర్షంతో దోర్నపు వాగు పొంగింది. దీంతో మండలంలోని తోట వెంగన్న పాలెం, తాళ్లూరు – విఠలాపురం , తాళ్లూరు – మల్లాపురం మధ్య దోర్నపు వాగు బ్రిడ్జిల పైకి ప్రమాదకర స్థితిలో నీరు రావటంతో ఆయా గ్రామాల మధ్య రాక పోకలు బంద్ అయ్యాయి. దీంతో ఆయా గ్రామాల వాగు వద్ద ఎస్సై మల్లిఖార్జున రావు పోలీస్ సిబ్బంది బాబు రావు , శ్రీనివాస్ , మాల కొండయ్యలను నియమించి రాక పోకలు నియంత్రించారు. ప్రమాదకర పరిస్థితిలలో వాగులలో దిగవద్దని కోరారు. రజానగరం వద్ద వాగు పొంగటంతో మల్లాపురం సచివాలయానికి ఉద్యోగాల రీత్యా వెళ్లాల్సిన పలువురు సచివాలయ సిబ్బంది వెళ్లలేని పరిస్థితి రావటంతో వాగు పరిస్థితిని ఎంపీడీఓ సానికొమ్ము సత్యం వెళ్లి పరిశీలించారు. మండలంలో గురువారం 28 మి.మీల మేర వర్షపాతం నమోదు అయినట్లు తహసీల్దార్ బివి రమణా రావు తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల బస్సులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆయా గ్రామాలకు విద్యార్థులను చేర్చారు.

విద్యార్థులు వృత్తి విద్యపై నైపుణ్యాన్ని పెంచుకోవాలి

విశాలాంధ్ర-మద్దిపాడు: విద్యార్థులు వృత్తి విద్యలు నైపుణ్యాన్ని పెంచుకున్నప్పుడు ఉన్నత భవిష్యత్తు ఉంటుందని కారుమూడి వారి పాలెం ప్రధానోపాధ్యాయులు మండవ ప్రభాకర్‌రావు తెలిపారు. శుక్రవారం గుండ్లపల్లి ఉన్నత పాఠశాల 9,10 తరగతిలో విద్యార్థులు కుంకుపాడు వద్ద కళ్యం టెక్స్‌టైల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమలపై అవగాహన పెంచుకొని టెక్స్ టైల్స్ రంగంలో నైపుణ్యం పెంచుకునే విధంగా విద్యార్థులను తర్ఫీదు చేస్తు న్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఎం.లక్ష్మి డి.కిషోర్ పి.ఉషారాణి కెవి నాగరాజుకుమారి ఎం శైలజ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

వెల్లంపల్లిలో గంజాయి పట్టివేత

విశాలాంధ్ర-మద్దిపాడు: వెల్లంపల్లిలో గంజాయి అమ్ముతు న్నారని సమాచారం మేరకు ఒంగోలు రూరల్ సర్కిల్ ఇని స్పెక్టర్ ఎన్ శ్రీకాంత్ బాబు, మద్దిపాడు ఎస్ఐ బి వెంకట సైదులు మరియు వారి సిబ్బందితో కలిసి జరిపిన దాడుల్లో వెల్లంపల్లి వద్ద అవాస్ హోటల్ కి ఎదురుగా మెయిన్ రోడ్డు పక్కన గంగాయని శుక్రవారం పట్టుకున్నారు ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు వివరాల మేరకు మద్దిపాడు పోలీసుస్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు చీమకుర్తి మండలం మరి చెట్ల పాలెం గ్రామమునకు చెందిన బండారి ఎస్తేరమ్మ ,ఒరిస్సాకు చెందిన దీప కుమార్ మాలికలు ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయిని రెండు కేజీలు తెచ్చుకొని వచ్చి వెల్లంపల్లి , ఆ పరిసర గ్రామాలలో అమ్ముతూ జీవించుచున్నట్లుగా తెలిసి వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని వారి ఇరువురిని మద్దిపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి సమక్షంలో వారు ఇరువురిని ఒంగోలు రూరల్ సీఐ యన్ .శ్రీకాంత్ బాబు అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీకాంత్ బాబు తెలిపారు. శనివారం జ్యుడిషియల్ రిమాండ్‌కి పంపనున్నట్లు సీఐ శ్రీకాంత్ బాబు తెలిపారు.

క్రీడల్లో సత్తాచాటిన ఎల్ ఎన్ పురం విద్యార్థులు

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మండలంలోని వగ్గంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీలలో లక్ష్మీ నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు.కబాడీ, ఖోఖో లో విజయం సాధించి న విద్యార్థిని విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యా యులు షేక్ ఖాజా మస్తాన్‌లను శుక్రవారం ప్రధానో పాధ్యాయులు పేట తిరుపతి రెడ్డిలను అభినందించి సన్మానించారు.

ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో తనిఖీ

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండల విద్యాశాఖ అధికారి శుక్రవారం ఎం.డి ఖాసిం మండలంలోని యండ్రపల్లిలో గల ప్రాథమి కోన్నత పాఠశాల, వెంకటరెడ్డి పల్లెలోని ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, విద్యార్థుల సామర్థ్యాలు,పాఠశాల రికార్డులు అన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయ వలసిన బాధ్యత మన అందరిపై ఉన్నదని, విలువలతో కూడిన విద్య ను అందించాలని తెలిపారు, ప్రజల సహకారంతో, సేవా సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను బలో పేతం చేయాలని, ప్రభుత్వ పథకాలు అందరు విద్యార్థులకు అందేలా కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు పొందిన ఎండ్రపల్లి ప్రధానోపాధ్యాయుడు డి. వెంకటేశ్వర్లు నాయక్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవార్డు బాధ్యతను పెంచిందన్నారు. పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ప్రధానో పాధ్యాయుడికి అవార్డు రావడం అభినందనీ యమని మండల విద్యాశాఖ అధికారి ఎం.డి. ఖాసిం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మోహన్ బాబు, అనురాధ పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోగా కృష్ణారావు

విశాలాంధ్ర-పీసీపల్లి : పీసీపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా జీవీ కృష్ణారావు శు క్రవారం బాధ్యతలను చేపట్టారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న జీవి కృష్ణారావును పీసీపల్లి ఎంపీడీవోగా నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న ఏవో హనుమంతరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు సత్వరమే అందేలా కృషి చేస్తానన్నారు. కార్యాలయ సిబ్బంది, నాయకులు ఎంపీడీవోను కలిసి అభినందనలు తెలిపారు.

ఓటీపీ విధానంతో దస్తావేజుల తయారీ జటిలం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : దస్తావేజు లేఖరుల రెండు రోజులు పాటు పెన్ డౌన్ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా యర్రగొండపాలెం దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో శు క్రవారం పట్టణంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదట అంబేద్కర్ విగ్రహం దగ్గర నుండి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ జోష్నాబాయికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన 2.0 సాఫ్ట్వేర్ విధానాల ద్వారా అటు ప్రజలు ఇటు దస్తావేజులేఖరులు చాలా విలువైన సమయాన్ని వృథా చేసుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఆధార్ ఓటీపీ విధానంతో దస్తావేజుల తయారీ జటిలమవుతుందని వాపోయారు. ఈనెల 19,20 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజుల రిజిస్ట్రేషన్ కు సంబంధించి ఎలాంటి సేవలు అందుబాటులో ఉండవని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కళ్యాణ్ చక్రవర్తి, బొర్రా రెడ్డి, ఆంజనేయులు, యోహాను, అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫామ్ పంపిణీ

విశాలాంధ్ర - కారంచేడు : పోషణ మాసం కార్యక్రమాల భాగంగా శుక్రవారం కారంచేడు పంచాయితీలోని అంగన్వాడీ సెంటర్ల ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ హిమబిందు ఆధ్వర్యంలో నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో స్మైల్ ఫౌండేషన్ హైదరాబాదు అనిల్ గౌరా వారి ఇనిస్టిట్యూషన్ నుండి,గౌతమ్ బుద్ధా ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. అంగన్వాడీ వర్కర్లు,తల్లిదండ్రులు,స్థానికులు పాల్గొన్నారు.

చవిటిపాలెంలో పోషణ్ మాసోత్సవాలు

విశాలాంధ్ర – సంతమాగులూరు : చవిటిపాలెంలో 8వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలను అంగన్వాడీ సూపర్ వైజర్ సుష్మారాణి ఆధ్వర్యంలో శు క్రవారం నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహార పదార్థాలు తయారీలో ఎక్కువగా వంటనూనెలు వాడకం మంచిది కాదన్నారు. ముఖ్యంగా గర్భిణులు,బాలింతలు,చిన్న పిల్లలు సమతుల్య ఆహారం తీసుకోవడం శ్రేయస్కరం అని చెప్పారు. సంతమాగులూరు పీహెచ్సీ వైద్యులు డాక్టర్ జ్యోత్స్న మాట్లాడుతూ పిల్లలకు చిరుధాన్యాలతో చేసిన స్నాక్స్ ఇవ్వాలని సూచించారు.అలాగే పండ్లు, తాజా కూరగాయలు, ఆకుకూరలతో ఆహారం తీసుకోవడం వలన ఊబకాయం వంటి సమస్యలు దరిచేరవని,తెలివితేటలు పెరగడానికి ఆస్కారం ఉంటుందని తెలిపారు.ఈకార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, జ్యోత్స్న, శ్రీదేవి, జయమ్మ పాల్గొన్నారు.

శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా రమేష్ నాయుడు నియామకం

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు ను కూటమి ప్రభుత్వం ట్రస్ట్ బోర్డు దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం శ్రీశైలం దేవస్థానం చైర్మన్ శ్రీశైల వెళ్లి దైవదర్శనం చేసుకొని అనంతరం తిరుగు ప్రయాణంలో దోర్నాల లో ని శ్రీ రంగ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కి సంద ర్శించారు. బిజెపి నాయకులు తంగిరాల అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

పోషణ, సంరక్షణలో శూలపాత్ర

విశాలాంధ్ర-పామూరు : మండలం లోని మార్కొండాపురం అంగన్వాడీ కేంద్రంలో 8 వ రాష్ట్రీయ పోషణ మాసం 20- 25 కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం. వి .ఎస్. పార్వతి ఆధ్వర్యంలో "పోషణ మరియు సంరక్షణలో పురుషుల భాగస్వామ్యం" అనే అంశంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ పురుషులు కుటుంబ సభ్యులకు పోషకాహారం అందించడం, గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు సరైన పోషకాలు తీసుకునేలా చూడటం, వారి ఆరోగ్య సంరక్షణలో పాలుపంచుకోవడం, పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు వారి ఆరోగ్యం ,విద్య, ఆటలు వంటి విషయాలలో శ్రద్ధ చూపడం, వంట ,ఇంటి పనులు, వ్యవసాయ పనులలో మహిళలకు సహాయం చేయడం, వారి మానసిక ఆరోగ్యానికి తోడుగా నిలబడటం వల్ల లింగ సమానత్వం,ఆర్థిక భద్రత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, అనూష సహాయకురాలు సౌందర్య, గ్రామంలోని తండ్రులు, గర్భవతులు బాలింతలు, పెద్దలు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు పట్టభద్రుల సంఘం చేయూత

విశాలాంధ్ర – వేటపాలెం : పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో ప్రాథమిక విద్యతో పాటు ఉన్నత విద్యకు చేయూత ఇవ్వడం ఈ సంఘం ప్రధాన ఆశయమని అధ్యక్షులు ప్రత్తి వెంకటసుబ్బారావు తెలిపారు. సంఘం ద్వారా ఉన్నత విద్య అభ్యసించుటకు విద్యార్థులకు మొత్తం రూ.27,000 చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. సయ్యద్ సుభాని,ఎస్.లోకేష్ బాబు,చింతం జగదీష్,పి.రాజాబాబుకు చెక్కులు అందజేశారు. అంతేకాక,సంఘం ఉపాధ్యక్షుడు బుర్రా సాంబశివరావు రిటైర్మెంట్ కావడం సందర్భంగా వారిని సత్కరించడం జరిగింది.కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకటసుబ్బారావు,సహాయ కార్యదర్శి నాగాంజనేయులు,ఫౌండర్ మెంబర్స్ గుడిమోటి శేఖర్ బాబు,నాగరాజు,లక్ష్మణ స్వామి, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజస్థాన్‌లో వెదుళ్ళపల్లి కొత్తపాలెం గ్రామ జవాన్ మృతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మండలంలోని వెదుళ్ళపల్లి కొత్తపాలెం గ్రామానికి చెందిన అగ్నివీర్ మేడిబోయిన వెంకట దుర్గారెడ్డి రాజస్థాన్‌లో మృతి చెందినట్లు రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాంబశివరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం రాజస్థాన్ నుంచి మృతదేహం అంబులెన్స్‌లో శనివారం స్వగ్రామానికి రానుందని చెప్పారు. అగ్నివీర్ వెంకట దుర్గారెడ్డి మృతిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం తరుపున తన కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రైతులకు యూరియా పంపిణీ: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : రైతులకు అవసరమైన మేరకు యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం బాపట్ల జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆర్.ఎస్.కెలు,పిఏసిఎస్ కేంద్రాల 16 ద్వారా 267 మెట్రిక్ టన్నుల యూరియాను 2689 మంది రైతులకు పంపిణీ చేయడం జరిగిందని,ఇంకా 136 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మహిళలు ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే సమాజం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని భవనంవారిపాలెం సర్పంచ్ మోదుగుల శివ నాగేశ్వరి,చందోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎన్.చంద్రిక,ఆయుష్ వైద్యురాలు షారోనా అన్నారు. మండలంలోని భవనంవారిపాలెం గ్రామంలో శుక్రవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారని చెప్పారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రాధా ఆధ్వర్యంలో విద్యార్థులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు గల పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ కే.నాగేశ్వరరావు,ఎంపిహెచ్ఓ నరసింహారావు, ఏఎన్ఎం, ఎంఎల్పిఎస్, ఆశా వర్కర్లు, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ



విశాలాంధ్ర - సంతమాగులూరు : పరిటాలవారిపాలెంలోని ఎంపీపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు డాక్టర్ కెఎల్.రావు మెమోరియల్ ఆధ్వర్యంలో విద్యా ఉపకరణాలను అందజేశారు. శుక్రవారం స్కూలు హెచ్ఎం ఆర్.కొండయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అతిథులుగా సంతమాగులూరు మండలం ఎంఈవోలు వేమవరపు కోటేశ్వరరావు,దార్ల దినేష్ కుమార్,దాత పరిటాల నారాయణ,కుందుర్రు హైస్కూలు హెచ్ఎం దారా బాలయ్య హాజరయ్యారు. అనంతరం దాత నారాయణ రూ.15వేలతో సమకూర్చిన నోటు పుస్తకాలు,పెన్నులు, క్రీడా వస్తువులు,ఉపకరణాలను బాలబాలికలకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం వెంకటేశ్వర్లు,యూటీఎఫ్ నాయకులు వలీఖాన్ పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలోని భవనంవారిపాలెం గ్రామంలోనీ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న పోషకాహారం ప్రాముఖ్యత గురించి పురుషులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జొన్న పిండి పకోడీ డెమోను చూపించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ రాధా మాట్లాడుతూ శారీరక,మానసిక వికాసం సరైన ఆహారపు అలవాట్లపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. వైద్యులు డాక్టర్ ఎన్.చంద్రిక,నాగేశ్వరరావు నరసింహారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడవ విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన ఫిట్టర్,డీజిల్ మెకానిక్,కోప ట్రేడు నందు ఉన్న ఖాళీలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉమామహేశ్వరిదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ :8074516183కు లేదా నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

జేసీ వ్యాఖ్యలపై మహిళా పోలీసుల వినతి

విశాలాంధ్ర - సంతమాగులూరు : మహిళా పోలీసుల విధుల పట్ల ప్రకాశం జిల్లా జేసీ రోణంకి గోపాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని సంతమాగులూరు మండలంలోని పనిచేస్తున్న మహిళా పోలీసులు ఖండించారు. శుక్రవారం ఎంపీడీవో జ్యోతిర్మయిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్‌లోని సిబ్బందికే పని ఉందని, మహిళా పోలీసులు ఏమి చేస్తున్నారో అర్థం కావడం లేదని జేసీ స్థాయిలో ఉన్న గోపాలకృష్ణ మాట్లాడడం తగదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు వలన మహిళా ఉద్యోగుల మనోభావాలు దెబ్బతినడమే కాకుండా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కేటాయించిన విధుల పట్ల నిబద్ధతతో పని చేస్తున్నామని చెప్పారు. పింఛన్లు పంపిణీ నుంచి పలు రకాల ప్రభుత్వ సర్వేలలో పాల్గొంటున్నామని తెలిపారు. అంతేకాకుండా గ్రామాల్లో నేర నియంత్రణ కోసం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మా కర్తవ్యాన్ని తూచా తప్పకుండా పాటిస్తుంటే జేసీ హోదాలో ఉన్న అధికారి మహిళా పోలీసులు ఏమీ చేయడం లేదని మాట్లాడటం దురదృష్టకరమన్నారు. తమ పనితీరు పట్ల నూరుశాతం సంతృప్తి ఉందని వ్యక్తం చేశారు. అలాగే మహిళా ఉద్యోగులను కించపరిచేలా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో మహిళా పోలీసులు మహాలక్ష్మి,లలిత,అమీన్, లక్ష్మీ సుమన,భార్గవి,సుమతి,మంజూష.శారద తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ డి.నాగార్జున,డాక్టర్ బొర్రా గౌతమి

విశాలాంధ్ర - నిజాంపట్నం : మహిళలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ డి.నాగార్జున,డాక్టర్ బొర్రా గౌతమి అన్నారు. మండలంలోని బొర్రావారిపాలెం పంచాయతీ అచ్యుతపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించడం సంతోషదాయకరమన్నారు. మహిళ ఆరోగ్యం - జాతీయ ఆరోగ్యం అని ఆలోచించి స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభించారన్నారు. ఆరోగ్యవంతమైన మహిళ- శక్తి వంతమైన,ఆరోగ్యవంతమైన కుటుంబానికి నిలయంగా ఉంటుందన్నారు. ఆరోగ్యకరమైన మహిళల కోసం అన్ని స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాల న్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే ఎప్పటి కప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య వంతమైన సమాజం కోసం మహిళలు వారి కుటుంబాలు ఆరోగ్యంగా ఉండాలని చెప్పారు. మహిళలు క్యాన్సర్ వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఒక వేళ క్యాన్సర్ వ్యాధి ఉన్నట్లయితే మొదట దశలోనే మందులు వాడుకొని తగ్గించుకోవచ్చు అని చెప్పారు. వైద్య రంగంలో క్యాన్సర్ వ్యాధికి అనేక రకాల మందులు వచ్చాయని మహిళలు భయపడ నవసరం లేదన్నారు. మంచి ఆరోగ్యం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు,సిబ్బంది దివ్య,రేష్మ, వెంకటరమణ, పీహెచ్ఎన్ హెచ్వి, ఎంపీహెచ్ఈఓ,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల సాగుపై అవగాహన

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల లక్ష్మీపురం గ్రామంలో ప్రొటెక్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఔషధ,సుగంధ మొక్కల బోర్డు సౌజన్యంతో నిర్వహిస్తున్న నర్సరీలో తిప్పతీగ,ఔషధ మొక్కల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె. ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ తిప్పతీగతో తయారు చేసినటువంటి ఔషధం ప్రతి కుటుంబానికి అవసరమన్నారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ సింధు ప్రయోగాత్మకంగా తిప్పసత్తు తయారు చేసి రైతులకు చూపించారు. శవనం చంద్రారెడ్డి,ఏఈఓ గోపి,వనమిత్ర పోనాటి హరిప్రసాద్,కన్సల్టెంట్ ఎం.విజయ్ కుమార్,రైతులు పాల్గొన్నారు.

అంధకారంలోకి జగన్న కాలనీ ప్రజలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలో టీచర్స్ కాలనీ వద్ద గల జగన్న కాలనీలో ట్రాన్స్‌ఫారం విద్యుత్ అధికారులు తొలగించారని కాలనీ ప్రజలు అడ్డుకూన్నారు. బీచ్ ఫెస్టివల్ కోసం చేస్తున్నారా లేదా ఏ కారణాలతో తొలగిస్తున్నారని కాలనీ ప్రజలు అడుగుతున్నా వాటికీ విద్యుత్ అధికారులు సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నారని కాలనీ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే రోడ్లు లేక వర్షపు నీళ్లతో ఇబ్బందులు పడుతున్న పట్టించుకోని వ్యక్తులు ట్రాన్స్‌ఫారాలు తీసివేస్తూ వాటికి రక్షణ వలయంగా ఉన్న ఇనపకంచిన తీసేస్తూ ఏ ఉద్దేశంతో ఈ విధంగా చేస్తున్నారని కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లను తొలగించేందుకు విద్యుత్ శాఖ ఏర్పాట్లు అడ్డుకున్న కాలనీవాసులు ఇరువురి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎవరు అడ్డుపడిన ఆపేదే లేదు అంటున్న కాంట్రాక్టర్ తెలిపారు.

డివిజన్ స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చీరాల డివిజన్ స్థాయి ఆటల పోటీలను జిల్లా విద్యాధికారి (డీఈఓ) పురుషోత్తం రిబ్బన్ కటింగ్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ,డిప్యూటీ డీఈఓ గంగాధర్ రావు, వేటపాలెం ఎంఈఓలు ఒకరికొకరు పోటీ పడి పరుగు పందెంలో పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా డీఈఓ పురుషోత్తం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడలకు కూడా అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని,విద్య అంటే కేవలం తరగతి గది బోధనాభ్యసన మాత్రమే కాదని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొన్నప్పుడే శారీరకంగా,మానసికంగా దృఢంగా తయారై,సమగ్ర అభివృద్ధిని సాధించి,భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు" అని అన్నారు. అనంతరం చీరాల డివిజన్ క్రీడల కోఆర్డినేటర్ కర్ణ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల పీఈటీలు అథ్లెటిక్స్ పోటీలను విజయవంతంగా నిర్వహించారు. ఎంఈఓలు జె.సుబ్బయ్య,పి. పురుషోత్తం, ప్రధానోపాధ్యా యురాలు తలమల దీప్తి,స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ చెరుకూరి రాంబాబు,వైస్ చైర్మన్ బండ్ల భారతి,పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బల్లికురవలో ఏ.ఎం.ఆర్ పాయింట్‌లో చెక్ పోస్ట్

విశాలాంధ్ర - బల్లికురవ : బల్లికురవ ఈర్లకొండ క్వారీల పరిసర ప్రాంతాలలో ఏఎంఆర్ చెక్ పోస్ట్ డబ్బాలు పెట్టడంతో గ్రానైట్ ఫ్యాక్టరీ యాజమానులు ఆందోళన చెందారు. క్వారీల నుంచి నాణ్యతమైన మెటీరియల్ లేక పరిశ్రమలు నడపాలంటే కష్టంగా మారిన తరుణంలో గవర్నమెంట్ ప్రైవేట్ సంస్థకు ఇవ్వడంతో ఇబ్బంది పడతామని గ్రానైట్ పరిశ్రమల వారు తెలిపారు. గ్రానైట్ ఫ్యాక్టరీలు కట్టినందుకు ఇ.ఎం.ఐలు, విద్యుత్ బిల్లులు కూడా కట్టలేని పరిస్థితి ఏర్పడి కొన్ని గ్రానైట్ ఫ్యాక్టరీలు కూడా మూత వేయడం జరుగుతుందని మరల ఇప్పుడు ప్రైవేట్ సంస్థ వారు సినారీజ్ కట్టాలంటే ఇప్పుడున్న పరిస్థితి కట్టలేమని తెలిపారు. కరోనా టైంలో గ్రానైట్ ఫ్యాక్టరీలు ఇబ్బంది పడి ఫైనాన్స్ కూడా కట్టలేక ఇప్పుడిప్పుడే కోలుకునే పరిస్థితిలో ప్రైవేట్ సంస్థ గుద్ది బండల మారిందని వాపోతున్నారు.